సాక్షి కర్నూలు

మంగళవారం । 29 । అక్టోబర్ । 2024



అన్నదానానికి రూ.లక్ష విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి సోమవారం విజయవాడకు చెందిన భీమిరెడ్డి కోటిరెడ్డి రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు.



మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తులకు వెండి రథోత్సవం నిర్వహించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,632
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:101.773
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:15,792
అవుట్ ఫ్లో	:15,432

న్యూస్‌రీల్

పింఛన్ల పంపిణీకి రూ.194.49 కోట్లు


- ఉమ్మడి జిల్లాకు 4,58,404 పింఛన్లు
- అక్టోబరు నెలతో పోలిస్తే 1,664 పింఛన్‌లపై కోత

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్‌టీఆర్ పెన్షన్ కానుక కింద నవంబరు నెలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో 4,58,404 పింఛన్లకు రూ.194.49 కోట్లు మంజూరయ్యాయి. కూటమి ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా పింఛన్లలో కోత విధిస్తోంది. అక్టోబరు నెలతో పోలిస్తే 1,664 పింఛన్లపై కోత పడింది. కర్నూలు జిల్లాలో 814, నంద్యాల జిల్లాలో 850 ప్రకారం తగ్గాయి. కర్నూలు జిల్లాలో 2,41,029 పింఛన్లకు సంబంధించి రూ.102.63 కోట్లు, నంద్యాల జిల్లాలో 2,17,375 పింఛన్లకు సంబంధించి రూ.91.86 కోట్ల ప్రకారం మొత్తం రూ.194.86 కోట్లు మంజూరయ్యాయి. ప్రభుత్వం పింఛన్ల పంపిణీకి నిధులను ఈ నెల 31న బ్యాంకులకు విడుదల చేయనుంది. అదే రోజున గ్రామ, వార్డు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసి నవంబరు ఒకటవ తేదీ ఉదయం 6 గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేస్తారు. యథావిధిగా రెండు రోజులు మాత్రమే పంపిణీ చేస్తారు.

నేడు ముసాయిదా ఓటరు జాబితా విడుదల

కర్నూలు(సెంట్రల్): స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్)-2025కు సంబంధించి ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు. ఈ జాబితాలను కలెక్టరేట్‌తోపాటు అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలు, ఆర్‌డీఓలు, తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచనున్నారు. జాబితాలపై ఏమైనా అభ్యంతరాలు, సలహాలు, సూచనలు ఇవ్వడానికి నేటి నుంచి నెల రోజుల పాటు గడువు కేటాయించారు.

నీట్ అకాడమీ డైరెక్టర్‌గా ఉమామహేశ్వరప్ప



కర్నూలు(అర్బన్): చిన్నటేకూరు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జూనియర్ కళాశాల ఐఐటీ/ నీట్ అకాడమీ డైరెక్టర్‌గా జూపాడుబంగ్లాలో ఫిజిక్స్ అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న బీ ఉమామహేశ్వరప్పను ప్రభుత్వం నియమించింది. ఆయన నియామకం పట్ల డీసీఓ డా.ఐ శ్రీదేవి, ఎస్‌డబ్ల్యూఆర్‌ఈఎఫ్ నాయకులు జీ చంద్రశేఖర్, పీఎస్ఎన్ మూర్తి, జయాకర్ తదితరులు అభినందనలు తెలిపారు.

సర్టిఫికెట్ల జారీలో జాప్యం చేస్తే చర్యలు

- ఆర్‌యూ వీసీ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: విద్యార్థుల సర్టిఫికెట్ల జారీలో జాప్యం చేస్తే చర్యలు తప్పవని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ హెచ్చరించారు. 'గాడి తప్పిన ఆర్‌యూ పరీక్షల విభాగం' శీర్షికతో ఈనెల 27వ తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందనగా సోమవారం వర్సిటీ పరీక్షల విభాగంపై వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ కుమార్ నాయుడుతో కలిసి వీసీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల విభాగం ఉద్యోగులు అందరూ అంకిత భావంతో విధులు నిర్వహించాలన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణ, ఫలితాల విడుదల, సర్టిఫికెట్ల జారీ తదితర వాటిని షెడ్యూల్ ప్రకారం చేయాలన్నారు. అత్యవసరంతో విద్యార్థులు వర్సిటీకి వస్తే ఉదయం 10 నుంచి 1 గంటలోగా సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకుంటే సాయంత్రంలోగా ఇవ్వాలని ఆదేశించారు. సాయంత్రం దరఖాస్తు చేసుకుంటే మరుసటి రోజు సర్టిఫికెట్లు జారీ చేయాలన్నారు. సమీక్షలో వర్సిటీ ఎగ్జామినేషన్స్ డీన్ ప్రొఫెసర్ వెంకటసుందరానంద్, వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో సీఆర్ రీడర్ ప్రింటర్ ఏర్పాటు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని రేడియాలజీ విభాగంలో రోగుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనంగా మరో ఫ్యూజి కంపెనికి చెందిన సీఆర్ రీడర్ ప్రింటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతిలోని ఎస్వీఆర్ఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో అదనంగా ఉన్న సీఆర్ రీడర్ ప్రింటర్‌ను అక్కడ ఉన్న అధికారులతో మాట్లాడి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగుల రద్దీ దృష్ట్యా కేటాయించాలని కోరగా వెంటనే వారు స్పందించి ఇక్కడకు పంపించారన్నారు. ఈ మిషన్ వల్ల ఎక్స్‌రే ఫిలిమ్స్‌ను మరింత త్వరగా ఇచ్చేందుకు వీలవుతుందన్నారు. దీంతో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో రేడియాలజీ విభాగపు వైద్యులు డాక్టర్ హరినాథ్, డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ వెంకటరమణ, చీఫ్ రేడియోగ్రాఫర్ రామసుబ్బయ్య పాల్గొన్నారు.

ఉల్లి కల్లోలం!



కర్నూలు మార్కెట్ యార్డుకు భారీగా చేరుకున్న ఉల్లి దిగుబడి

దిగుబడిని చూసి ఇక ఈ ఏడాది తమ పంట పండిందని ఉల్లి రైతులు భావించారు. కష్టానికి ప్రతిఫలం దక్కుతుందని ఆనంద పడ్డారు. అయితే ఆ ఆనందం మార్కెట్‌కు చేరేలోపే మాయమవుతోంది. అధికారుల నిర్లక్ష్యంతో నష్టాలు మూటగట్టుకుంటున్నారు. ప్రభుత్వానికి ముందు చూపులేకపోవడం.. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం.. వ్యాపారులు సిండికేటు కావడం.. ఇలా ఎన్నో కారణాలతో ఉల్లి రైతుల అవస్థలు అన్నీఇన్నీ కావు. చేతికొచ్చిన దిగుబడిని చివరకు అతికష్టం మీద అమ్ముకోవాల్సిన పరిస్థితి దాపురించింది. పంట యార్డుకు చేరుతున్న సమయంలో ధరలు నేలచూపు చూస్తుండటంతో వారి ఆందోళన అంతా.. ఇంతా కాదు.

- అధికారుల నిర్లక్ష్యంతో ఉల్లి రైతు కుదేలు
- ఆరు రోజుల్లోనే యార్డుకు 1.26 లక్షల క్వింటాళ్లు
- కొనుగోళ్లలో మార్కెటింగ్ శాఖ పూర్తిగా వైఫల్యం
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేక అవస్థలు
- వ్యాపారుల సిండికేట్‌తో నష్టపోతున్న రైతులు
- తగ్గుతున్న ధరలతో మరింత ఆందోళన

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు మార్కెట్ యార్డుకు గతేడాది వరకు సీజన్‌లో ఉల్లి రోజుకు 9 వేల క్వింటాళ్లకు మించి ఎన్నడూ రాలేదు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో రోజూ 20 వేల క్వింటాళ్ల వరకు వస్తోంది. ఈ ఏడాది జిల్లాలో 43,875 ఎకరాల్లో ఉల్లి సాగు అయ్యింది. ఇందులో 50 శాతం పైగా నీటి వసతి కిందనే సాగు చేయడంతో దిగుబడులు భారీగా పెరిగాయి. ఎకరాకు నీటి వసతి కింద 100 క్వింటాళ్లు, వర్షాధారం కింద 50 క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తోంది. కేవలం ఆరు రోజుల్లో రోజుల్లోనే కర్నూలు మార్కెట్‌కు 1,06,526 క్వింటాళ్లు వచ్చింది. సోమవారం ఒక్కరోజే 43,926 బస్తాలు యార్డుకు చేరుకున్నాయి. ధర ప్రారంభంలో ఆశాజనకంగా ఉండటంతో పంట కోతలు కూడా పెరిగాయి. అయితే అధికారుల నిర్లక్ష్యం రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేసింది. దిగుబడులు యార్డుకు చేరుతున్న క్రమంలో ఈ-నామ్ సర్వర్ రోజుల తరబడి మొండికేయడం, మార్కెట్‌కు వచ్చే దిగుబడులను అధికారులు అంచనా వేయలేక పోవడంతో రైతులు తీవ్రమైన కష్టాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. మార్కెట్‌కు చేరే పంటను అంచనా వేసి డిమాండ్‌కు అనుగుణంగా కాటాదారులు, లారీలను సిద్ధం చేసి ఉంటే రైతులకు ఇబ్బందులు అంతగా ఉండేవి కావు. కొనుగోలు చేసిన ఉల్లిని బయటకు తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. లారీల కొరత ఏర్పడటం వల్ల మార్కెట్‌లో ఉల్లి నిల్వలు పేరుకుపోయాయి. కాటా వేయడంలో జాప్యం జరుగుతుండటంతో వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు గ్రేడింగ్ చేయిస్తూ రైతులకు తీవ్ర నష్టం కలిగించారు. మరోవైపు మార్కెట్‌లో దొంగల బెడద కూడా ఎక్కువైంది. మార్కెట్‌కు వచ్చినప్పటి నుంచి అమ్ముకొని బయటికి వెళ్లేంత వరకు కంటికి దిగుబడులను రెప్పలా కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



యార్డులో ఆరబోసిన ఉల్లి

వ్యాపారుల మాయాజాలం

మరోవైపు వ్యాపారులు సిండికేట్ అయి ధరల పెరుగుదలను నిరోధిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మార్కెట్‌కు ఉల్లిగడ్డలు పోటెత్తుతున్నా.. ధరలు దాదాపు నిలకడగానే అంటే క్వింటాలుకు రూ.4,500 వరకు ధర లభిస్తోంది. మార్కెట్‌లోకి సరఫరా పెరిగినపుడు ధరలు తగ్గుతాయి. కాని మార్కెట్‌కు ఉల్లి తాకిడి రోజురోజుకు పెరుగుతున్నా ధరలు నిలకడగానే ఉన్నాయంటే డిమాండ్ ఉన్నట్లే. కాని కర్నూలు మార్కెట్‌లో మాత్రం ఆశించిన మేర ధరల్లో పెరుగుదల లేకపోగా కొంతమేర తగ్గడం సిండికేట్ వ్యవహారమేనన్న అనుమానం వ్యక్తం అవుతోంది. తాజాగా మార్కెట్‌లో క్వింటాలుకు గరిష్ట ధర రూ.4,347 లభించినా.. మోడల్ ధర మాత్రం రూ.2,669 మాత్రమే. దీన్ని బట్టి చూస్తే ఎక్కువ మంది రైతులకు రూ.1,000 నుంచి రూ.2,000 వరకే ధర లభించింది. దేశం నలుమూల నుంచి ఉల్లి కోసం ఆర్డర్‌లు వస్తున్నాయి. కర్నూలు ఉల్లి ప్రధానంగా పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాలకు తరలుతోంది. దేశవ్యాప్తంగా డిమాండ్ ఉన్నప్పటికీ వ్యాపారులు సిండికేట్ అవుతుండటంతో ధరలో పెరుగుదల లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గ్రేడింగ్ పేరుతో వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారు. 50 క్వింటాళ్ల గ్రేడింగ్ చేస్తే దాదాపు 4 క్వింటాళ్ల వరకు గ్రేడింగ్‌లో నాణ్యత లేదని, కుళ్లిందని పక్కన పడేస్తున్నారు.

మార్కెట్‌కు చేరిన ఉల్లి దిగుబడి వివరాలు

తేదీ	రైతులు	వచ్చిన ఉల్లి (క్వింటాళ్లు)
21	404	13,070
22	382	9,736
23	669	19,870
25	683	19,711
26	823	24,372
28	730	19,767
మొత్తం	3421	1,06,526

రైతుల కష్టాలపై జేసీ ఆరా



మార్కెట్ యార్డులో పర్యటిస్తున్న జేసీ నవ్య

యార్డుకు ఉల్లి పోటెత్తుతుండటంతో జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య సోమవారం మార్కెట్‌లో పర్యటించారు. రోజుకు 20 వేల క్వింటాళ్లు వచ్చి వాహనాలు రోడ్లపైనే నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జేసీ నవ్య, కర్నూలు ఆర్‌డీవో కిలారి సందీప్ తదితరులు మార్కెట్ యార్డులో పర్యటించారు. పలువురు రైతులతో ముఖాముఖి మాట్లాడారు. రైతుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఏడీఎం నారాయణమూర్తి, సెక్రటరీ జయలక్ష్మిని జేసీ ఆదేశించారు. ధరలను ప్రకటించడం, కాటాలు వేయడంలో జాప్యం జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

క్వింటాకు రూ.1,762 లభించింది



ఉల్లి నాణ్యత బాగానే ఉంది. కనీసం క్వింటానికి రూ.3 వేల వరకు ధర లభిస్తుందని ఆశించాను. కాని క్వింటాకు రూ.1,762 మాత్రమే ధర లభించింది. ఈ సారి అర ఎకరాలో సాగు చేయగా 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పెట్టుబడి దాదాపు రూ.50 వేలు వచ్చింది. వ్యాపారులు సిండికేట్ కావడం వల్లనే ధర తగ్గిపోయింది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది.

– రాముడు, గుడిపాడు, గూడూరు మండలం

వ్యాపారుల సిండికేట్‌తో నష్టం



నేను ఎకరాలో ఉల్లి సాగు చేశా. పెట్టుబడి రూ.లక్ష వరకు వచ్చింది. సోమవారం 25 క్వింటాళ్లు మార్కెట్‌కు తెచ్చాము. కేవలం రూ.1,826 మాత్రమే ధర లభించింది. ఉల్లి నాణ్యత బాగా ఉండటంతో రూ. నాలుగు వేలకు పైగా వస్తుందని ఆశ పడ్డాను. అయితే వ్యాపారులు సిండికేట్ కావడంతో రైతులు నష్టపోతున్నారు. – చిన్న వెంకటేశ్వర్లు, రుద్రవరం, కర్నూలు మండలం

కొత్త వ్యాపారుల కోసం అన్వేషణ

ఆలస్యంగా మేల్కొన్న అధికారులు కొనుగోలు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. కర్నూలు మార్కెట్‌లో 30 మంది వరకు వ్యాపారులు ఉన్నారు. వీరిలో 20 మంది వరకే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. వీరే సిండికేట్ అవుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మార్కెట్ కమిటీ యంత్రాంగం కూడా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటంతో జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. వ్యాపారుల సిండికేట్‌ను నిరోధించి వ్యాపారుల మధ్య పోటీ పెంచేందుకు ఉమ్మడి జిల్లాలోని వివిధ మార్కెట్ కమిటీల్లో ఆసక్తి ఉన్న ట్రేడర్లను గుర్తించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉల్లి కొనుగోలు చేయడానికి కొత్త వ్యాపారులు ముందుకు వస్తే లైసెన్స్‌లు ఇప్పిస్తామని అధికారులు చెబుతున్నారు.

సైబర్ నేరగాళ్ల కొత్త పంథా

- బాలింతలకు ఫోన్ చేసి రూ. 15 వేలు మంజూరయ్యాయని ఆశ
- తర్వాత ఫోన్‌పే లింక్ పంపి డబ్బుల స్వాహా



హాలహర్వి: సైబర్ నేరగాళ్లు రూట్ మార్చారు. బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు ఎవరైనా బ్యాంక్ అకౌంట్ నంబర్ అడిగినా, ఓటీపీ అడిగినా చెప్పొద్దని ప్రజలకు అవగాహన కల్పిస్తుండటంతో వారు తమ దోపిడీకి సరికొత్త మార్గం ఎంచుకున్నారు. అభం శుభం తెలియని బాలింతల సెల్ ఫోన్లకు కాల్ చేసి 'మీరు ప్రసవించడంతో మీకు ప్రభుత్వం నుంచి రూ.15 వేలు నగదు వస్తుంది. ఈ డబ్బు మీ ఫోన్ పే ఖాతాకు జమ అవుతాయి.. ఫోన్‌పే నంబర్ చెబితే లింక్ పంపిస్తామని..దానిని క్లిక్ చేస్తే డబ్బులు అకౌంట్‌లో పడతాయి' అని ఆశ పెడుతున్నారు. నమ్మి లింక్‌ను క్లిక్ చేయగానే వీరి బ్యాంక్ ఖాతాలోని డబ్బు మాయమవుతుంది. హాలహర్వి మండలంలో ఈ కొత్త రకం మోసానికి ఇద్దరు గురయ్యారు. నిట్రవట్టి గ్రామానికి చెందిన బాలింత జి.మీనాక్షి భర్త రమేష్ ఖాతా నుంచి రూ.21,000, గూళ్యం గ్రామానికి చెందిన మరో బాలింత పుష్పవతి బంధువు ఖాతా నుంచి రూ. 36 వేలు నగదు కాజేశారు. తర్వాత బాధితులు హాలహర్వి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారిని సోమవారం తిమ్మన్నయాదవ్, హాలహర్వి ఎస్ఐ చంద్రను కలిసి ఫిర్యాదు చేయడంతో సైబర్‌నేరగాళ్ల మోసం వెలుగులోకి వచ్చింది.

నేటి నుంచి ఉచిత గ్యాస్‌కు బుకింగ్

కర్నూలు (సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత మొదటి గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేసుకోవాలని డీఎస్ఓ రాజా రఘువీర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, గ్యాస్ కనెక్షన్ ఉన్నవాళ్లంతా గతంలో గ్యాస్ బుకింగ్ ఎలా చేసుకుంటారో అదే పద్ధతిలో బుకింగ్ చేసుకుంటే 31వ తేదీ నుంచి డెలివరీ ఇస్తామన్నారు. ముందుగా వినియోగదారులే గ్యాస్ కోసం డబ్బులు చెల్లించాలని, డెలివరీ అయిన 24 గంటల్లో ఆ డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ కనెక్షన్‌కు అనుసంధానమైన బ్యాంక్ అకౌంట్‌కు జమ చేయనున్నట్లు చెప్పారు. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి మాసాలకు సంబంధించి మొదటి ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం నాలుగు నెలల్లో ఎప్పుడైనా బుక్ చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేశారు

- ఎస్పీని ఆశ్రయించిన బాధితుడు

కర్నూలు (టౌన్): తన కుమారునికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని కర్నూలు నగరంలోని హోసన్నా మందిరం వద్ద ఉన్న శ్రేయాస్ అనే వ్యక్తి డబ్బులు తీసుకుని మోసం చేశాడని కల్లూరు మండలం ఉద్యోగ నగర్‌కు చెందిన ప్రకాష్ రాజ్ ఎస్పీ బిందుమాధవ్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ స్పష్టం చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను ఎస్పీ స్వీకరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 141 ఫిర్యాదులు అందినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, సీఐ శివశంకర్ పాల్గొన్నారు.



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆదోని అర్బన్: పట్టణంలోని బసాపురం రోడ్డులో మార్కెట్ గేటుకు ఎదురుగా ఉన్న నాగేంద్ర జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలో సోమవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. దీనిని మార్కెట్ యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం క్వింటానికి మద్దతు ధర రూ. 7,520 ఇస్తుందన్నారు. పత్తిలో తేమశాతం ఎక్కువ ఉంటే ధర తగ్గుతుందన్నారు. సీసీఐలో పత్తి విక్రయానికి ముందుగానే రైతులు రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీసీఐ జూనియర్ కమర్షియల్ ఎగ్జిక్యూటివ్ గౌతమ్, మార్కెట్ యార్డు అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీసీఐ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

జీతాలు చేయకుండా హెచ్‌ఎం వేధిస్తున్నారు!

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఉపాధ్యాయుల ఫిర్యాదు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు రూరల్ మండలం పూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీ శేషఫణిరాజు రెండు నెలల నుంచి జీతాలు చేయకుండా వేధిస్తున్నారని ఆ పాఠశాలలోని ఉపాధ్యాయులు బూకార్ సాహెబ్, జి.నాగేంద్రుడు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్‌బాషాకు విన్నంచారు. సెప్టెంబర్, అక్టోబర్ మాసాల జీతాలు ఇంత వరకు ఇవ్వలేదని, హెచ్‌ఎంను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదని, రెండు నెలల నుంచి తమ కుటుంబాలను పస్తులు ఉంచుకోవాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి సమస్యలు ఉన్న ప్రజలు పరిష్కారం కోసం అధికారులకు అర్జీలు అందజేశారు. ప్రజా వినతులు రీఓపెన్ కాకుండా తగిన పరిష్కారాలు చూపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పూడూరు జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు

ఫిర్యాదుల్లో కొన్ని..

- తమ భూమిని రెవెన్యూ అధికారులు డబ్బులు దండుకుని ఇతరులకు ఆన్‌లైన్ చేశారని పత్తికొండ మండలం కనకదిన్నెకు చెందిన బోయరా మాంజిని ఫిర్యాదు చేశారు. దేవనకొండ మండల జిల్లెడుబుడకల గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 177లో తనకు 2.66 ఎకరాల భూమి ఉందని, బోయ కృష్ణయ్య అనే వ్యక్తి పేరిట ఆన్‌లైన్ చేశారని, దానిని రద్దు చేయించాలని కోరారు.
- రద్దు చేసిన పెన్షన్‌ను పునరుద్ధరించాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని కర్నూలుకు చెందిన అబ్బాస్ అనే వృద్ధుడు కలెక్టర్‌కు విన్నవించారు. పెన్షన్ లేకపోవడంతో జీవనం ఇబ్బందిగా ఉందని, పిల్లలు పట్టించుకోవడం లేదని, తన పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరారు.
- కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో దొంగల బెడద నుంచి రైతులకు రక్షణ కల్పించేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ఉల్లికి క్వింటాల్ రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు మద్దతు ధర ఇప్పించాలని ఏపీ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, జి.రామకృష్ణ కలెక్టర్‌కు విన్నవించారు.
- మంత్రాలయం మండల కేంద్రం సమీపంలోని సర్వే నంబర్ 106లో ఉన్న పొలాలకు రస్తా లేకుండా కొందరు అడ్డుకుంటున్నారని, రస్తాను వారి బారి నుంచి కాపాడాలని బాధితులు శ్రీనివాసులు, రామకృష్ణ, బొండాయి తిమ్మప్ప,ఈడిగ రఘన్న, తెలుగు రమేష్ కోరారు.
- ఓర్వకల్లు మండలంలో ఇళ్లులేని పేదలను గుర్తించి స్థలాలు ఇచ్చి గృహాలు నిర్మించి ఇవ్వాలని సీపీఐ నాయకులు కె.జగన్నాథం, రమేష్ విన్నవించారు.
- దేవనకొండ మండలం జిల్లెడుబుడకల గ్రామానికి చెందిన శ్మశాన వాటిక రహదారిని కొందరు ఆక్రమించుకోవడంతో వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

పేదలు ఇళ్లు కట్టుకోకుండా ఎలా అడ్డుకుంటారు ?

- టీడీపీ నాయకుల తీరుపై కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే కాటసాని ఫిర్యాదు

గత ప్రభుత్వమిచ్చిన స్థలాల్లో పేదలు ఇళ్లు కట్టుకోకుండా టీడీపీ నాయకులు ఎలా అడ్డుకుంటారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్లూరు మండలం చెట్లమల్లాపురంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 89 మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇప్పుడు ఆ స్థలాల్లో ఇళ్లు కట్టుకోకూడదని పేదలను అధికారపార్టీ నాయకులు బెదిరిస్తున్నారని సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్‌బాషా దృష్టికి తీసుకెళ్లారు. పేదలు ఇళ్లు కట్టుకోకూడదని ఏమైనా నిబంధనలు ఉంటే తెలపాలన్నారు. ఇందుకు కలెక్టర్ స్పందించి ఇళ్లు కట్టుకోకుండా అడ్డుకునే అధికారం ఎవరికీ లేదని.. చెట్లమల్లాపురానికి సంబంధించిన అంశంపై విచారణ చేయిస్తానని హామీ ఇచ్చారు. కాటసాని వెంట చెట్లమల్లాపురం సర్పంచ్ భూపాల్‌రెడ్డి, నాయకులు మధు, విజయ్, సుధాకర్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పెద్దాసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వెంకటేశ్వర్లు



కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్‌గా డాక్టర్ కె.వెంకటేశ్వర్లును నియమిస్తూ సోమవారం సాయంత్రం ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఆసుపత్రిలోని ఆర్థోపెడిక్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయనకు పదోన్నతి కల్పించి సూపరింటెండెంట్‌గా నియమించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డిని మార్చనున్నారనంటూ గత కొంత కాలంగా చర్చ కొనసాగుతోంది. ఈ మేరకు ఎట్టకేలకు ఆయనను మారుస్తూ వెంకటేశ్వర్లుకు బాధ్యతలు అప్పజెప్పారు. ఈయన పాఠశాల విద్యను కోరుకొండ సైనిక్ స్కూల్‌లో చదివారు. ఆ తర్వాత ఎంబీబీఎస్, ఆర్థోపెడిక్‌లో ఎంఎస్‌ను 1985 నుంచి 1995 వరకు గుంటూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అభ్యసించారు. 1998లో కర్నూలు మెడికల్ కళాశాలలో ఆర్థోపెడిక్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. 2015లో ప్రొఫెసర్‌గా ఇక్కడే పదోన్నతి పొందారు. ఆయన సర్వీసులో మధ్యలో రెండేళ్ల పాటు వరంగల్‌లోని ఎంజీఎం కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఆయనకు సూపరింటెండెంట్ పదవి దక్కడంతో మెడికల్ కళాశాల, ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది అభినందన తెలిపారు.

కార్తీక మాసోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలో నవంబరు 2 నుంచి డిసెంబరు వరకు జరగనున్న కార్తీక మాసోత్సవాల ఏర్పాట్లను దేవస్థాన ఇన్‌చార్జ్ ఈఓ ఇ.చంద్ర శేఖర్‌రెడ్డి సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. క్యూలైన్లు, లడ్డూప్రసాదాల తయారీ, ఆలయ పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం పుష్కరిణిహారతి, పాతాళగంగ, పార్కింగ్ ప్రదేశాల వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసాదాల తయారీలో శుభ్రతలను పాటించాలన్నారు. శని, ఆది, సోమవారాలు, ప్రభుత్వ సెలవురోజులు, పర్వదినాలలో భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రసాదాల తయారు చేసుకోవాలన్నారు. భక్తులు కోరినన్ని లడ్డూ ప్రసాదాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పుష్కరిణి వద్ద లైటింగ్, పుష్పాలంకరణ చేయాలని, ఆలయ ఉత్తరమాడవీధులలో భక్తులు దీపాలను వెలిగించుకునేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పాతాళగంగ పరిసరాలను, పాతాళగంగమెట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్‌చార్జ్ ఈఓ వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎం.నరసింహారెడ్డి, పారిశుద్య విభాగం పర్యవేక్షకులు డి. రాధాకృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు (ఐ/సి) పి.వి. సుబ్బారెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

అతిగా మద్యం తాగి యువకుడి మృతి


మృతి చెందిన రాజు

కోవెలకుంట్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో సోమవారం ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి అందించిన సమాచారం మేరకు.. దొర్నిపాడు మండలం చాకరాజువేముల గ్రామానికి చెందిన మంగలిరాజు(32)కు చిన్నతనంలో తల్లిదండ్రులు మృతిచెందారు. ఇదే గ్రామంలో ఉంటున్న బంధువులు రాజును పెంచి పెద్దచేశారు. తల్లిదండ్రులతోపాటు తనకంటూ రక్త సంబంధీకులు ఎవరూ లేకపోవడంతో కొన్నేళ్ల నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం సాయంత్రం కోవెలకుంట్లకు వచ్చి అతిగా మద్యం సేవించాడు. ఇంటికి తిరిగి వెళ్లే క్రమంలో తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పడిపోయాడు. రాత్రి సమయం కావడంతో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో దాహంతో గొంతు ఎండిపోయి మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. మృతుని బంధువులకు సమాచారం చేరవేసి మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కోవెలకుంట్ల: మండలంలోని అమడాల గ్రామానికి చెందిన ఓ వివాహిత సోమవారం బలవన్మరణానికి పాల్పడింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన రామాంజనేయులు అనే యువకుడికి కొలిమిగుండ్ల మండలం హనుమంతగుండం గ్రామానికి చెందిన నీలవేణి (26) అనే మహిళతో రెండు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి 11 నెలల వయసున్న కుమార్తె ఉంది. ఈ క్రమంలో కుటుంబ సమస్యలతో జీవితంపై విరక్తి చెందిన నీలవేణి సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు కిందకుదించి చికిత్స నిమిత్తం కోవెలకుంట్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందింది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు విచారణ జరుపుతున్నారు.

పశువులను కత్తితో పొడిచిన వ్యక్తి అరెస్టు

గోనెగండ్ల: మూడు రోజుల క్రితం గోనెగండ్లలోని లక్ష్మీపేట, కిందిగేరి తదితర కాలనీలలో పశువులు ఆవులు, ఎద్దులు, గేదెలను కత్తితో పొడిచి గాయపరిచిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గత శుక్ర, శనివారం రాత్రిపూట గ్రామంలో ఆరుబయట కట్టిఉంచిన మూగజీవాలను గుర్తు తెలియని వ్యక్తి కత్తితో పొడిచి తీవ్ర గాయాలు చేసినట్లు పశువుల యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై పోలీసులు రెండు రోజుల పాటు గ్రామంలో విచారణ జరపగా గోనెగండ్లకు చెందిన బండమీద షేక్ మదీనా అనే వ్యక్తి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలియడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఏఎస్ఐ తిమ్మారెడ్డి, పోలీసులు రవి కుమార్, మద్దిలేటి తదితరులు ఉన్నారు.

శ్రీశైలం ఘాట్‌లో రోడ్డు ప్రమాదం



ఘాట్ రోడ్ మలుపు వద్ద రక్షణ స్తంభాన్ని ఢీకొన్న కారు

శ్రీశైలం: శ్రీశైలం – దోర్నాల ఘాట్ రోడ్డులో చిన్నారుట్ల చెంచుగూడెం సమీపంలోని మలుపు వద్ద స్విఫ్ట్ కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న సిమెంట్ స్తంభాన్ని ఢీకొట్టి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆ మార్గంలో వెళుతున్న ప్రయాణికులు 108కు ఫోన్ చేయడంతో పాటు ఫారెస్ట్ అధికారులకు కూడా సమాచారం అందించారు. గాయాలపాలైన వారిని 108 అంబులెన్స్ వాహనం ద్వారా ప్రాజెక్ట్ వైద్యశాలకు తరలించారు. ప్రమాదం జరిగిన ప్రాంతం ప్రకాశం జిల్లా పరిధిలో ఉండడంతో దోర్నాల పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు తెలిసింది. కారులో ప్రయాణిస్తున్న వారు తూర్పు గోదావరి జిల్లా కాకినాడకు చెందిన వ్యక్తులుగా పోలీసులు తెలిపారు.

బ్రెయిన్ స్ట్రోక్.. బీ కేర్‌ఫుల్

- రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడమే కారణం
- పెరిగిన బ్రెయిన్ స్ట్రోక్ బాధితులు
- మానసిక ఒత్తిడి, ధూమ, మద్యపానాలు కారణం
- బీపీ, షుగర్ నియంత్రణ లేకపోవడమూ ఒక కారణమే
- పెద్దాసుపత్రిలో ప్రత్యేకంగా స్ట్రోక్ యూనిట్
- కోవిడ్ అనంతరం పెరిగిన కేసులు

మనిషిలోని ముఖ్యమైన అవయవాల్లో మెదడు ఒకటి. శరరం మొత్తాన్ని నడిపేది ఈ అవయవమే. మెదడు ఆరోగ్యంగా ఉన్నప్పుడు శరీరం అదుపు తప్పకుండా పనిచేస్తుంది. మెదడులో చిన్న సమస్య తలెత్తినా బ్రెయిన్ స్ట్రోక్ ఏర్పడుతుంది. ఎలాంటి ముందస్తు సూచనలు లేకుండా వచ్చేదే బ్రెయిన్‌స్ట్రోక్ (పక్షవాతం). రక్తప్రసరణలో అవరోధం కలగడం, నరాలు చిట్లడం ప్రధాన కారణాలు. మెదడుకు ఆక్సిజన్, పోషకాలు తీసుకెళ్లే రక్తనరాలు చిట్లడం, రక్తప్రసరణకు అంతరాయం ఏర్పడటం వల్ల మెదడులోని ఆ భాగం కణ మరణానికి దారి తీసి స్ట్రోక్‌కు కారణం కావచ్చు. ఈ నెల 29వ తేదీన వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ సందర్భంగా ప్రత్యేక కథనం.



కర్నూలు(హాస్పిటల్)/గోస్పాడు: మారుతున్న జీవనశైలిలో భాగంగా స్ట్రోక్స్ పెరుగుతున్నాయి. ఒకప్పుడు 50 ఏళ్లు దాటితేనే ఇలాంటి సమస్య వచ్చేది. ఇప్పుడలా కాదు. 25 ఏళ్ల వయస్సు దాటిన ప్రతి నలుగురిలో ఒకరు తమ జీవితకాలంలో స్ట్రోక్ బారిన పడుతున్నారు. చిన్న వయస్సు వారు స్ట్రోక్ బారిన పడటం వల్ల వారి కుటుంబాలు ఆర్థికంగా చిన్నాభిన్నం అవుతాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 5 శాతం మంది బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్నట్లు వైద్యుల అంచనా. ఈ వ్యాధికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు నంద్యాలలోని సర్వజన వైద్యశాలలోనూ న్యూరోఫిజిషియన్లు, జనరల్ ఫిజిషియన్లు చికిత్స అందిస్తున్నారు. వీరితో పాటు ప్రైవేటు రంగంలోనూ ప్రస్తుతం 30 మందికి పైగా న్యూరాలజిస్టులు, 150 మందికి పైగా ఉన్న జనరల్ ఫిజిషియన్లు చికిత్స చేస్తున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని న్యూరాలజీ విభాగానికి ప్రతి సోమ, గురువారం ఓపీ నిర్వహిస్తారు. ఆ రెండు రోజుల్లో దాదాపు 500 మంది వివిధ నరాల వ్యాధులతో చికిత్స కోసం వస్తారు. అందులో 20 నుంచి 30 శాతం మంది స్ట్రోక్ (పక్షవాతం) బాధితులు ఉంటున్నారు. వ్యాధిలక్షణాలు కనిపించిన నాలుగున్నర గంటల్లో సమీప నెట్‌వర్క్ ఆసుపత్రికి వెళితే చికిత్స అందుకుని వైకల్యం నుంచి బయటపడవచ్చు. ఈ క్రమంలో ఖరీదైన మందులు, చికిత్సను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉచితంగా అందిస్తున్నారు. కాగా పక్షవాతం వచ్చిన రోగులకు నగరంలోని చాలా ఆసుపత్రులు ఎన్‌టీఆర్ వైద్యసేవ కింద చికిత్స చేయడం లేదు. కేవలం ఒకటి, రెండు ఆసుపత్రుల్లో మాత్రమే స్ట్రోక్‌కు వైద్యం అందుతోంది. నెట్‌వర్క్ ఆసుపత్రులు తమకు ప్యాకేజీ సరిపోదనే భావనతో రోగులను చేర్చుకోవడం లేదు. అయితే బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వారిలో ఆపరేషన్ అవసరమైన రోగులను మాత్రమే వైద్యసేవ పథకం కింద నెట్‌వర్క్ ఆసుపత్రులు చేర్చుకుని చికిత్స అందిస్తున్నాయి.


పెద్దాసుపత్రిలోని స్ట్రోక్ యూనిట్

కోవిడ్ అనంతరం పెరిగిన బాధితులు

కోవిడ్–19 అనంతరం పక్షవాతం బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కోవిడ్ కారణంగా మనిషి శరీరంలోని రక్తనాళాల్లో పలు చోట్ల రక్తం గడ్డలు (థ్రాంబోసిస్) కట్టుకుని ఉంటోందని, కొన్నిసార్లు ఇవి మెదడుకు వెళ్లే రక్తనాళాల్లో బ్లాక్ కావడం వల్ల స్ట్రోక్ వస్తోందని వైద్యులు చెబుతున్నారు. ఇటీవల చాలా మంది వారికి తెలియకుండానే దీని బారిన పడుతున్నారు.

మొదటి నాలుగున్నర గంటలు కీలకం

బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన మొదటి నాలుగున్నర గంటల్లో ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తే ప్రాణాపాయంతో పాటు వైకల్యం నుంచి బయటపడవచ్చు. బ్రెయిన్ స్ట్రోక్ ఇస్కీమిక్ స్ట్రోక్, హెమరైజ్డ్ స్ట్రోక్ అనే రెండు రకాలుగా వస్తుంది. మెదడులోని రక్తనాళాల్లో రక్తప్రసరణ సక్రమంగా లేకపోవడం వల్ల శరీరంలోని కొన్ని భాగాలు చచ్చుబడిపోతాయి. దీన్నే ఇస్కీమిక్ స్ట్రోక్ అంటారు. మెదడులోని రక్తనాళాలు చిట్లినప్పుడు అంతర్లీనంగా రక్తస్రావం జరుగుతుంది. దీన్నే హెరేజిక్ స్ట్రోక్ అంటారు.

బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు

- అకస్మాత్తుగా ముఖం, చేయి, కాలులో తిమ్మిర్లు లేదా బలహీనంగా అనిపించడం
- అకస్మాత్తుగా మాట్లాడటంలో ఇబ్బంది, విషయాలు అర్థం చేసుకోలేకపోవడం
- ఒకటి లేదా రెండు కంటి చూపుల్లో ఇబ్బందులు ఏర్పడటం
- నడవటానికి ఇబ్బంది, సరిగ్గా బ్యాలెన్స్ చేసుకోలేకపోవడం
- ఎలాంటి కారణం లేకుండా విపరీతమైన తలనొప్పి

బ్రెయిన్‌స్ట్రోక్‌కు కారణాలు

- యువతలో స్ట్రోక్‌కు కారణాలు పనిలో ఒత్తిడి, స్మోకింగ్, మద్యపానం అలవాట్లు.
- జీవనశైలిలో మార్పులు, శారీరక శ్రమ లేకపోవడం, మధుమేహం, రక్తపోటు, రక్తంలో కొలెస్ట్రాల్ లెవెల్స్ ఎక్కువగా ఉండటం, ఒబెసిటీ ఉన్న వారికి స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఎక్కువ.
- అన్యూరిజం వంటి శరీర నిర్మాణ లోపాలు, పుట్టుకతో జన్యుపరమైన లోపాల కారణంగా రక్తం గడ్డకట్టే గుణం ఉన్న వారికి స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది.
- గుండెజబ్బులున్న వారికి బ్రెయిన్ స్ట్రోక్ రావచ్చు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో తీవ్రనష్టం

మెదడుకు వెళ్లే రక్తం సరఫరాలో అంతరాయం ఏర్పడటం కారణంగా మెదడు పనితీరు క్షీణించి స్ట్రోక్ వస్తుంది. 85 శాతం మందికి కాళ్లు, చేతులు, చచ్చుపడిపోవడం, కొందరికి మూతి వంకరపోవడం, మాట నత్తిగా రావడం, మాట్లాడలేకపోవడం, కళ్లు మసకబారడం, చూపు కోల్పోవడం వంటివి జరుగుతాయి. 15 శాతం మందిలో మాత్రమే మెదడులో నరాలు చిట్లిపోయి అంతర్గత రక్తస్రావం అవుతుంది.

పెద్దాసుపత్రిలో ప్రత్యేకంగా స్ట్రోక్ యూనిట్



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీన పది పడకలతో న్యూరాలజీ విభాగంలో ప్రత్యేకంగా స్ట్రోక్ యూనిట్ ఏర్పాటు చేశాం. ఇక్కడే జనరల్ మెడిసిన్ విభాగంలోనూ కొందరు రోగులు చికిత్స పొందుతున్నారు. స్ట్రోక్‌తో నాలుగున్నర గంటల్లో ఆసుపత్రికి వచ్చిన వారికి రూ.40 వేల విలువైన థ్రాంబోలైటిస్ థెరపీ చికిత్సను ఉచితంగా అందిస్తున్నాం. దీనివల్ల ప్రాణాపాయంతో పాటు వైకల్యం బారిన పడకుండా ఉంటారు.

–డాక్టర్ సి.శ్రీనివాసులు, హెచ్ఓడీ, న్యూరాలజీ విభాగం, పెద్దాసుపత్రి

సత్వరం వైద్యం అందించాలి



బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు కనిపించిన వెంటనే నాలుగున్నర గంటల్లో ఆసుపత్రికి తీసుకొస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయి. థ్రాంబోలైసిస్ అనే ఇంజెక్షన్ ఇస్తాం. ఇది వెంటనే నరాల్లో గడ్డకట్టిన రక్తాన్ని పలుచన చేసి మెదడుకు రక్త సరఫరాను పునరుద్ధరిస్తుంది. ఆ తర్వాత వస్తే మాత్రం మెదడులో న్యూరాన్స్ తగ్గిపోతాయి. ఈ కారణంగా మెదడుకు రక్తసరఫరా తగ్గిపోయి ఇబ్బంది ఏర్పడుతుంది. ఒకసారి స్ట్రోక్‌కు గురైన వారు రెండోసారి రాకుండా జాగ్రత్త పడాలి. సక్రమంగా మందులు వాడుతూ వ్యాధిని అదుపులో ఉంచుకోవాలి.

– డాక్టర్ అనిల్‌కుమార్, న్యూరాలజిస్ట్, నంద్యాల

మార్కెట్ కమిటీ అసిస్టెంటు సెక్రటరీపై వేటు?

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీలో అసిస్టెంటు సెక్రటరీని బదిలీ చేసేందుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. ఇక్కడ ఇద్దరు అసిస్టెంటు సెక్రటరీలు ఉన్నారు. ఒకరు అదనంగా ఉన్నారనే కారణంతో పాణ్యం మార్కెట్ కమిటీ సెక్రటరీగా బదిలీ చేసేందుకు మార్కెటింగ్ శాఖ చర్యలు చేపట్టింది. సదరు అసిస్టెంటు సెక్రటరీ గత నెలలో మల్టిపుల్ గ్రేడింగ్ యూనిట్ నిర్వాహకుడికి ఫోన్ చేసి 'వచ్చి మాట్లాడుకో.. లేదంటే మంత్రి టీజీ భరత్ వచ్చి తాళం వేస్తారని' ఫోన్‌లో బెదిరించారనే ఆరోపణలు ఈయనపై ఉన్నాయి. దీనిపై గత నెల 26న 'సాక్షి' దినపత్రికలో వచ్చి మాట్లాడుకో.. లేదంటే తాళమే శీర్షికన వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై విచారణ జరిపి నివేదిక పంపాలని ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ రాయలసీమ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు, మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మిను ఆదేశించింది.

అంతర్ వర్సిటీల కబడ్డీ పోటీలకు ఆర్‌యూ జట్టు


ఆర్‌యూ కబడ్డీ జట్టుతో వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలకు ఎంపికైన రాయలసీమ యూనివర్సిటీ జట్టును వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎన్‌టీకే నాయక్ అభినందించారు. సోమవారం ఆర్‌యూ జట్టుకు క్రీడా దుస్తులను పంపిణీ చేసిన వీసీ అనంతరం మాట్లాడుతూ.. ఈనెల 30 నుంచి నవంబర్ 3వ తేదీ వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎం ఐఎస్‌టీలో జరిగే దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీల్లో ఆర్‌యూ జట్టు పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి వర్సిటీకి మంచి పేరు తీసుకురావాలన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్‌నాయుడు, ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.వి. శివకిషోర్, వర్సిటీ కబడ్డీ జట్టు మేనేజర్ డాక్టర్ పి.ముత్తయ్య పాల్గొన్నారు.

టమాట లారీ బోల్తా


లారీ బోల్తా పడడంతో నేలపాలైన టమాట

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని యు.కొత్తపల్లె గ్రామం వద్ద జాతీయ రహదారిపై సోమవారం బైకును తప్పించేక్రమంలో టమాట లారీ అదుపు తప్పి పక్కన ఆగి ఉన్న కారుపై పడింది. వివరాలు.. అనంతపురం నుంచి ఢిల్లీకి టమాట లోడుతో వెళుతున్న లారీ కొత్తపల్లె వద్దకు రాగానే ముందు వెళుతున్న బైకును తప్పించేక్రమంలో ఒక్కసారిగా పక్కకు తిప్పడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన నిలిపి ఉంచిన కారు మీద పడింది. ఆ సమయంలో కారులో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ప్రమాదంలో బైకుపై వెళుతున్న బలరాముడు, అతని కుమారుడు మహేంద్రతో పాటు టమాట లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కారు నుజ్జునుజ్జు కాగా లారీలోని టమాట రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. ప్రమాదంపై పట్టణ పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

- బంగారు, వెండి ఆభరణాల రికవరీ


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఇస్రార్ బాషా

నంద్యాల(సిటీ): దొంగతనాలకు పాల్పడే ఇద్దరు వ్యక్తులను నంద్యాల తాలూకా పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. తాలూకా పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఇస్రార్ బాషా నిందితుల వివరాలను వెల్లడించారు. నిందితులు డక్కా కిరణ్ బాబు – కడమలకాల్వ, షేక్ హుస్సేన్ – సాదిక్‌నగర్ లను సోమవారం రైతునగరం హైవే బ్రిడ్జి వద్ద అరెస్టు చేసి వారి నుంచి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారినుంచి నల్లపూసలదండ – 3.38 తులాలు, రెండు చిన్న ఉంగరాలు – 0.620 గ్రాములు, ఒక పెద్ద ఉంగరం – 0.51 గ్రాములు, వెండి 500 గ్రాములు, మరో 2 తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని కోర్టుకు అప్పజెప్పనున్నట్లు తెలిపారు. కేసులో ప్రతిభ చూపిన ఎస్ఐ గంగయ్యాయాదవ్, హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు నాయుడు, పవన్‌లను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

దంత వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక


అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ మురళీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): ఏపీ దంత వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కర్నూలుకు చెందిన డాక్టర్ వై.మురళీధర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఒంగోలులోని సాయి ఐటీసీ కన్వెన్షన్ హాలులో 43వ రాష్ట్ర దంత వైద్యుల సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలశ్రీ బాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, గుంటూరు ఎమ్మెల్యే గల్లా మాధవి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొన్నారు. ఈ సదస్సుకు రాష్ట్రం నలుమూలల నుంచి 850 మంది దంత వైద్యులు హాజరయ్యారు. ఇందులో అత్యంత అడ్వాన్స్‌డ్ పరికరాలు, ఆధునిక చికిత్సల గురించి చర్చించారు. ఈ కార్యక్రమానికి ఆర్గనైజింగ్ సెక్రటరీగా కర్నూలుకు చెందిన డాక్టర్ రాయపు రామచంద్రారెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో కర్నూలు నుంచి దంత వైద్యులు సునీల్‌కుమార్‌రెడ్డి, కిశోర్, నరేష్‌గౌడ్, దత్తసాయి, సందీప్ పాల్గొన్నారు.

వాహనం ఢీకొని నక్క మృతి

ఆత్మకూరురూరల్: స్థానిక అటవీ డివిజన్ పరిధిలోని బైర్లూటి సమీపంలో సోమవారం ఉదయం రోడ్డు దాటుతున్న ఒక గోల్డెన్ జాకాల్ (నక్క)ను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో నక్క అక్కడికక్కడే దుర్మరణం పాలైంది. విషయం తెలుసుకున్న నాగలూటి రేంజర్ దొరస్వామి నక్క మృతదేహాన్ని బైర్లూటి వన్యప్రాణి ఆసుపత్రికి తరలించి వన్యప్రాణి వైద్యులు జుబేర్‌తో పోస్ట్‌మార్టం చేయించారు. అనంతరం అటవీ సిబ్బంది నక్క కళేబరాన్ని దహనం చేశారు.

కొత్తూరు సుబ్బరాయుడి ఆదాయం రూ. 20.18 లక్షలు


కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామికి రూ. 20.18 లక్షల ఆదాయం సమకూరింది. భక్తులు స్వామి వారికి హుండీల్లో సమర్పించిన కానుకలను సోమవారం దేవదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. జూలై 20 నుంచి నేటి వరకు భక్తులు సమర్పించిన కానుకను లెక్కించగా రూ.20,18,305 నగదు, 2.300 గ్రామాలు బంగారు, 925 ములు వెండి సమకూరినట్లు ఈఓ రామకృష్ణ తెలిపారు. కానుకల లెక్కింపులో నంద్యాల డివిజన్ దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, గ్రామ పెద్దలు శివరామిరెడ్డి, అర్చకుల వీరయ్య, క్రిష్ణయ్య, రాముడు, మాధవస్వామి, నంద్యాల బాలజీ సేవా సభ్యులు పాల్గొన్నారు.

వినికిడి పరీక్షల శిబిరానికి స్పందన


మాట్లాడుతున్న ఆర్‌బీఎస్‌కే కో-ఆర్డినేటర్ హేమలత

కర్నూలు(హాస్పిటల్): జాతీయ వినికిడి లోప రుగ్మతల నివారణ కార్యక్రమం, దీన్ దయాల్ శ్రవణ ఫౌండేషన్, జాతీయ ఆరోగ్య మిషన్ సహకారంతో సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని డైస్ కేంద్రంలో నిర్వహించిన ఉచిత వినికిడిలోప రుగ్మతల స్క్రీనింగ్ శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆర్‌బీఎస్‌కే, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ హేమలత చెప్పారు. ఈ శిబిరానికి జిల్లావ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి 0–19 ఏళ్ల పిల్లలు, వృద్ధులు కలిపి మొత్తం 256 మంది పాల్గొన్నారన్నారు. వీరికి స్పెషలిస్టు వైద్యులు పరీక్షలు నిర్వహించారని తెలిపారు. వీరిలో 240 మందికి వినికిడి సమస్యలు ఉన్నట్లు గుర్తించామని, బాధితులకు త్వరలో అవసరమైన చికిత్స, వినికిడి పరికరాలు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో దీన్ దయాల్ శ్రవణ ఫౌండేషన్ ప్రతినిధి విశ్వనాథ్, ఆడియాలజిస్టులు డాక్టర్ సింధు, డాక్టర్ ప్రశాంతి, డెమో శ్రీనివాసులు, డైస్ మేనేజర్ ఇర్ఫాన్, ఎపిడమాలజిస్టు వేణుగోపాల్, ఆరోగ్య విద్యాబోధకులు పద్మావతి, ఆర్‌బీఎస్‌కే కన్సల్టెంట్ మల్లికార్జున పాల్గొన్నారు.

మందుబాబుకు నెల రోజుల జైలు

- మద్యం మత్తులో వీరంగం సృష్టించడంతో చర్యలు

మహానంది: మండలంలోని ఎంసీ ఫారం గ్రామానికి చెందిన యువకుడు ఈ.శ్యామ్ మద్యం మత్తులో వీరంగం సృష్టించడంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా 30 రోజుల జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి సోమవారం తీర్పునిచ్చారు. ఘటనపై మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఎంసీ ఫారం గ్రామానికి చెందిన శ్యామ్ ఆదివారం రాత్రి పూటుగా మద్యం సేవించి ఆడవారితో అసభ్యంగా ప్రవర్తించాడన్నారు. దీంతో పాటు మహానంది వ్యవసాయ కళాశాల లేడీస్ హాస్టల్ వద్దకు చేరుకుని కత్తి పట్టుకుని విద్యార్థినులకు సైగలు చేస్తూ బీభత్సం సృష్టించడంతో వారు భయభ్రాంతులకు గురయ్యారని చెప్పారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 30 రోజుల జైలుశిక్ష విధించినట్లు తెలిపారు. ఇదిలాఉండగా శ్యామ్ మహానందిలో ఇటీవల జరిగిన ఓ ఘర్షణ కేసులో ఏ1గా ఉన్నాడని బెయిల్‌పై బయట తిరుగుతున్నాడన్నారు.

ఎస్సార్బీసీకి నీటి విడుదల


ఎస్సార్బీసీ పదో బ్లాక్ కాల్వలో ప్రవహిస్తున్న నీరు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల సమీపంలోని శ్రీశైలం కుడిగట్టుకాల్వ(ఎస్సార్బీసీ) 10వ బ్లాక్ కాల్వకు సోమవారం నుంచి అధికారులు నీటి విడుదలను పునరుద్ధరించారు. కాల్వకు అధికంగా నీటిని విడుదల చేయడంతో ఇటీవల కోవెలకుంట్ల– గుంజలపాడు ఆర్‌అండ్‌బీ రహదారికి 200 మీటర్ల దూరంలో గండి పడిన విషయం తెలిసిందే. ఈ మేరకు మట్టికట్ట, ఇసుక బస్తాలతో గండిని పూడ్చివేశారు. రబీ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని కాల్వ దిగువ ప్రాంతాలకు సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో ఎస్సార్బీసీ అధికారులు యథావిధిగా నీటి విడుదలకు చర్యలు తీసుకోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సమస్యలు ఆలకించేదెవరు?

ప్రజా సమస్యల పరిష్కారానికి అది వేదిక. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులు హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కారానికి దారి చూపుతారు. అయితే సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు అధికారులు సెల్‌ఫోన్ చూస్తూ అధిక సమయం గడిపారు. ఇది గమనించిన ప్రజలు ఇలాగైతే ప్రజా సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని చర్చించుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు